'చెప్పుకో చూదాం?'

'నువ్వే చెప్పు-'

'ఆమె తల నలంకరించిన ఒకానొక-'

'తెలిసిందిలే-మల్లెపూవు.'

'కాదు! శిరోజం!'

'నలుగురికీ తెలిసే భాషలో వెంట్రుక.'

'నొప్పి కలక్కుండా మెల్లిగా వూడదీశాను-కాయితాన్ని పొట్లంకట్టి భద్రంగా జేబులో వేశాను. ఇంటికివచ్చి ఈ వెండి లాకెట్ లో పెట్టేను-చూశావా?'

'నేను చూడను! నీ భార్యకు చూబెట్టు, కళేజా వున్నవాడివైతే!'

---

# అమృత హస్తం

'వచ్చావా... ఈ దీనుడి ప్రాణాలను రక్షించడానికి?'

'..............'

'రా! ఏదీ నీ అమృతహస్తం! నా హృదయంమీద వేసి నన్ను శాంతింపజెయ్యి-'

'..............'

'నువ్వు రావడం ఇంకొక్క క్షణం ఆలస్యమైతే ఈ బాకుతో పొడుచుకుని చచ్చిపోయివుందును...'

'ఎంత దారుణమైన విధానం...!'

'నేను రాయలేదూ నీకూ-నువ్వు నన్ను నిజంగా ప్రేమించిన దానవైతే ఈ ఉత్తరం అందగానే వెంటనే బయల్దేరివచ్చి నన్ను ఆత్మహత్య నుంచి తప్పించవలసింది... అనీ?'

'అవును! ఎనిమిదిన్నర దాటితే ఈ వెధవ బాకుతో పొడుచుకుని శారున చచ్చి వూరుకుంటానన్నారు!'

'గడియారం చూడూ! సరిగ్గా ఎనిమిదిన్నరకీ ఒక అర నిముషం ఉండగా వచ్చావు-'

'అక్కడకి ఆలస్యమవుతుందేమోనని టాక్సీ కట్టించుకుని వచ్చా-'

'నన్ను రక్షించడానికి! ఈ దీనుడ్ని రక్షించడానికి! మన నోములు ఫలించాయి-'

'ఇద్దరివీ నా?'

'ముమ్మాటికీ! విధికృతం ఇది...ఇంకా ఎందుకీ వెధవ/నీచపు బాకు- విసిరేస్తా...'

'అయినా ఆ బాకుతో-ఆ పసునులేని, తప్పుపట్టిన బాకుతో పొడుచు కుని చచ్చిపోమనీ ఎవరు చెప్పారూ?'

'మరేంచెయ్యనూ-ఇదే సమయానికి కంటికి కనపడింది-'

'ఎంత బాధపడాలి, దానితో పొడుచుకుంటే...?'

'చావదలచుకున్నవాడికి బాధతో నిమిత్త మేమిటి?'

'మరణాన్నికూడా సునాయాసంగా బాధలేనిదానిలా చేసుకో వచ్చునుగా?'

'అయినా ఇప్పుడింక ఆ గొడవ దేనికిలే?'

'మీకు అర్థంకావటంలేదు-'

'ఇగునో, ఇది తీసుకోండి- నేను వచ్చిన పని ముగించుకుపోతా-'

'ఏమిటీ డబ్బా?'

'తీసి చూసుకోండి-'

'ఇదేమిటి మాత్ర?'

'ఇదే మీకు నేను చేయదలచుకున్న ఆఖరి ఉపకారం-ఆ వెధవ బాకుతో పొడుచుకుని బాధపడేకన్నా దీనితో సునాయాసంగా...'